సాక్షి నల్లగొండ

సోమవారం । 14 । అక్టోబర్ । 2024



దసరా వేడుకల్లో ఘర్షణ

చిలుకూరు మండలంలో బేతవోలు గ్రామంలో శనివారం రాత్రి దసరా వేడుకల్లో ఘర్షణ చోటుచేసుకుంది.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 588.40 అడుగులు
ఇన్‌ఫ్లో	: 43,096 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 43,096 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,745 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 6,041 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 5,510 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం :	644.30 అడుగులు
ఇన్‌ఫ్లో	: 910 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 1,147 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 243 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 170 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

నేటి నుంచి కళాశాలలు పునఃప్రారంభం

నల్లగొండ: ఇంటర్మీడియట్ కళాశాలలు సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నట్లు డీఐఈఓ కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఇంటర్ బోర్డు ఈ నెల 6నుంచి 13వ తేదీ వరకు జూనియర్ కళాశాలలకు దసరా సెలవులు ప్రకటించదిందని పేర్కొన్నాయి. సెలవులు ఆదివారంతో ముగిసినందున సోమవారం నుంచి కళాశాలలు తిరిగి ప్రారంభం కానున్నట్లు తెలిపాయి.

దుర్గామాత సన్నిధిలో ఎస్పీ దంపతుల పూజలు



పూజలు చేస్తున్న ఎస్పీ శరత్ చంద్రపవార్

నల్లగొండ రూరల్: విజయదశమి సందర్భంగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్ దంపతులు దుర్గాదేవి చిత్రపటం వద్ద కళశాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. దేవికి హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాదాద్రీశుడికి వెండి కలశాలు బహూకరణ



ఆలయ ఈఓ భాస్కర్‌రావుకు వెండి కలశాలు అందజేస్తున్న దాతలు

యాదగిరి గుట్ట రూరల్: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి హైదరాబాద్‌లోని నాచారానికి చెందిన నర్సింగరావు, రేణుక దంపతులు ఐదు వెండి కలశాలు బహూకరించారు. ఆదివారం దేవస్థానం ఈఓ భాస్కర్ రావును కలిసి కలశాలను అందజేశారు. మరో దాత నవీన్‌కుమార్ బంగారు తాపడం కోసం రూ.77,985 చెక్కు రూపేణా అందజేశారు.

శ్రీలక్ష్మీనారసింహుడికి గరుడ వాహన సేవ



గరుడ వాహనంపై శ్రీలక్ష్మీనరసింహస్వామిని ఊరేగిస్తున్న అర్చకులు, ఆలయ సిబ్బంది

మఠంపల్లి: మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం విజయదశమి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్ల సమేతంగా శ్రీనరసింహస్వామిని గరుడ వాహనంపై ఆలయ తిరు మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయంలో ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జమ్మిచెట్టు వద్ద శమీ పూజను జరిపించారు. అద్దాల మండపంలో పవళింపు సేవ నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్తలు, ఏఓ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

తిరుగు పయనం.. ట్రాఫిక్ వలయం



కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్ వైపు బారులుదీరిన వాహనాలు

కేతేపల్లి: దసరా పండుగకు స్వగ్రామాలకు వెళ్లిన ప్రజలు ఆదివారం హైదరాబాద్ నగరానికి తిరుగు పయనమయ్యారు. దీంతో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగింది. దీంతో కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ఉన్న 12 వెహికల్ పాసింగ్ బూతులకుగానూ 7 టోల్ బూతులను సిబ్బంది హైదరాబాద్ వైపు కేటాయించారు. జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కారణంగా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

సంబురంలా దసరా



విజయదశమి (దసరా) పండుగ సందర్భంగా శనివారం రాత్రి నల్లగొండలోని రామాలయంలో జమ్మి చెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు



వివేకానందనగర్‌లో రావణాసుర వధ



కాగితంపై కోరికలు రాసి జమ్మి చెట్టు కొమ్మలకు తలిగిస్తున్న భక్తులు

పల్లె పోరుపై సందిగ్ధం

ఈ ఏడాది గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగేది కష్టమే!

- బీసీ కులగణనకు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- రెండు నెలల పాటు కొనసాగనున్న ప్రక్రియ
- రిజర్వేషన్లు ఖరారయ్యాకే ఎన్నికలు జరిగే అవకాశం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఈ ఏడాది పంచాయతీ ఎన్నికలు జరిగేలా లేవు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం హడావుడి చేసినా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈలోగా బీసీ కులగణన డిమాండ్ ముందుకు రావడంతో ప్రభుత్వం స్థానిక సంస్థ ఎన్నికల నిర్వహణలో జాప్యం చేస్తూ వచ్చింది. ప్రస్తుతం బీసీ కులగణన చేపట్టేందుకు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. రెండు మాసాల్లో కులగణన పూర్తి కానుంది. అంటే ఈ ఏడాది డిసెంబర్ వరకు కులగణన పూర్తయ్యే అవకాశం ఉంది. అంటే ఈ ఏడాది పంచాయతీ ఎన్నికలతోపాటు మండల ప్రాదేశిక, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికలు కూడా లేనట్టేననిపిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో పంచాయతీలు, ఓటర్లు

జిల్లా	మండలాలు	పంచాయతీలు	వార్డులు	ఓటర్లు
నల్లగొండ	31	856	7,392	10,42,545
సూర్యాపేట	23	486	4,388	6,82,882
యాదాద్రి	17	426	3,698	5,20,441

కుల గణనకు జీవో 13 విడుదల

ప్రభుత్వం బీసీ కులగణన కోసం సామాజిక రాజకీయ, ఆర్థిక సర్వే కోసం జీవో 13ను విడుదల చేసింది. గత ఎంతో కాలంగా బీసీ కులగణన చేపట్టాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తూ వస్తున్నాయి. ఈసారి అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల సందర్భంలోనూ బీసీ కులగణన డిమాండ్ బలంగా రావడంతో ప్రభుత్వం కులగణన చేపడతామని చెప్పింది. అందులో భాగంగానే కులగణన కోసం జీవోను విడుదల చేసినట్టు తెలుస్తోంది.

రెండు మాసాల పాటు సర్వే..

బీసీ కులగణన కోసం విడుదలైన జీవో 13 సందర్భంలోనే ప్రభుత్వం రెండు మాసాల్లో కులగణన పూర్తిచేయాలని నిర్ణయించింది. అక్టోబర్ మాసంతో పాటు డిసెంబర్ 15 వరకు కుల గణనకు సంబంధించిన సర్వే పూర్తి స్థాయిలో చేయనున్నారు. అంటే డిసెంబర్ వరకు సర్వే పూర్తవుతున్నందున ఆ తర్వాత ప్రభుత్వం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు తేల్చి పంచాయతీ ఎన్నికల కోసం నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఎన్నికలు లేనట్లేనని స్పష్టమవుతోంది.

పంచాయతీ పాలకవర్గాల కాల పరిమితి పూర్తయి 9 నెలలు..

2019 జనవరిలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. ఫిబ్రవరి మాసంలో పాలక వర్గాలు కొలువుదీరాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆ పాలక వర్గాల కాల పరిమితి పూర్తయింది. ఆలోగానే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జాప్యం జరిగింది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయదుందుబి మోగించింది. ఇదేసందర్భంలో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా నిర్వహిస్తే అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారన్న ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు. కానీ, బీసీ కులగణన చేపట్టిన తర్వాత నిర్వహించాలన్న డిమాండ్ బలంగా రావడంతో ఎన్నికలకు పోలేదు.

వచ్చే సంవత్సరం జనవరి నుంచే..

2025 జనవరిలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించిన తర్వాత మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. ఆలోగా మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం కూడా పూర్తవనున్నందున ప్రభుత్వం వరుసగా ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లుగా విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అయితే ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని ప్రభుత్వం చెబుతోంది. వాటి కోసం గ్రామ స్థాయిలో కమిటీలు వేయనున్నారు. దాంతో కాంగ్రెస్ పార్టీ గ్రామాల్లో మరింత ప్రజల్లోకి వెళ్లే అవకాశం ఉంది. అలా అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని శక్తిగా కాంగ్రెస్ అవతరించవచ్చని ప్రభుత్వం భావిస్తోన్నట్లు తెలుస్తోంది.

నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ: జిల్లాలో గుర్తించిన కొనుగోలు కేంద్రాల్లో సోమవారం నుంచి కొనుగోళ్లు ప్రారంభించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన.. ఆర్డీఓలు, తహసీల్దార్లు, పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులతో జిల్లా కేంద్రం నుంచి ఏర్పాటుచేసిన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ వానాకాలం పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 375 కేంద్రాలు ప్రారంభించాలని నిర్ణయించామన్నారు. మొదటి విడతగా 325 కొనుగోలు కేంద్రాలు తెరిచేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, తూకం, తేమ కొలిచే యంత్రాలు, రైతులు వేచి ఉండేందుకు టెంట్, కుర్చీలు, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇప్పటికే ఆర్జాలబావి వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి వంద మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రమణేశ్వరంలో శ్రీచక్ర ఆలయం ప్రారంభం

భువనగిరి రూరల్: భువనగిరి మండలం రమణేశ్వరంలో నూతనంగా నిర్మించిన శ్రీచక్ర ఆలయాన్ని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదివారం ప్రారంభించారు. దేవీశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఇక్కడ 1023 శ్రీచక్రాలు 33 శివలింగాలను ప్రతిష్ఠించిన విషయం విదితమే. వీటిని మంత్రి సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో తిరుగుతూ ఆలయాన్ని తిలకించారు. గోవులకు ఆహారం తినిపించారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

దుర్గమ్మ శోభాయాత్ర



నల్లగొండలోని రాక్‌హిల్స్ కాలనీలో ఆదివారం దుర్గామాత శోభాయాత్రలో భక్తుల నృత్యం



నల్లగొండలోని వల్లభరావు చెరువులో దుర్గామాత విగ్రహం నిమజ్జనం చేస్తున్న భక్తులు

నీలగిరిలో ట్రాఫిక్ ఆంక్షలు

- రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యం
- పలుచోట్ల ముందస్తు హెచ్చరిక బోర్డులు
- ఫ్రీటర్న్ కోసం బ్లూ కోట్స్ ఏర్పాటు
- నిబంధనలు ఉల్లంఘిస్తే భారీగా జరిమానాలు



జిల్లా కోర్టు సమీపంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నల్లగొండ క్రైం: రోడ్డు ప్రమాదాల నివారణకు నీలగిరి పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలను కఠినతరం చేస్తున్నారు. డ్రైవింగ్, ప్రాణం.. మీ చేతిలోని ఉంది.. సురక్షితంగా గమ్యానికి చేరండంటూ నల్లగొండ పట్టణంలోకి ప్రవేశించే నాలుగు దిక్కుల్లో ఇప్పటికే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పట్టణంలో సైతం యూ టర్న్ తీసుకునే ప్రధాన కూడళ్ల వద్ద కూడా హెచ్చరిక బోర్డులు పెట్టారు. పట్టణంలోని ప్రధానంగా నాలుగు రోడ్లలో ఎక్కడబడితే అక్కడ యూ టర్న్ తీసుకోకుండా భారీ సిమెంట్ ఇటుకలతో రహదారులను మూసి వేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే..

రోడ్డు రవాణా నియమ నిబంధనలకు విరుద్ధంగా ర్యాష్‌గా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, ట్రిపుల్ డ్రైవింగ్ చేసేవారితోపాటు నంబర్ ప్లేటు లేకుండా వాహనాలు నడిపే వారిపైనా ట్రాఫిక్ ఆంక్షలకు లోబడి ఆన్‌లైన్ పద్ధతిలో జరిమానా విధిస్తున్నారు. ప్రధాన కూడళ్ల వద్ద ఫ్రీ టర్న్ కోసం బ్లూ కోట్స్ ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులోకి వచ్చినప్పటికీ నిబంధనలు పాటించని వాహనదారులను సెల్‌ఫోన్ ద్వారా ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో జరిమానా విధిస్తున్నారు. ఇదేకాక ప్రధాన కూడళ్లలో నిబంధనలు ఉల్లఘించే వారిని సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా గుర్తించి జరిమానా విధించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. క్లాక్‌టవర్ సెంటర్, బస్టాండ్ రోడ్డు, డీఈఓ కార్యాలయం వద్ద ఫ్రీ టర్న్ లేకపోవడంతో వాహనదారులు సిగ్నల్స్‌ను అనుసరించాల్సి ఉంటుంది.

జరిమానా ఇలా.. (రూపాయలలో..)

సెల్‌ఫోన్ డ్రైవింగ్	1,000
ట్రిపుల్ రైడింగ్	1,200
ఓవర్ స్పీడ్	1,000
అధిక శబ్దం చేస్తే	1,000
సిగ్నల్ జంపింగ్	1,000
నంబర్ ప్లేటు లేకుంటే	200
ఇన్సూరెన్స్ లేకపోతే	1,000
రాంగ్ పార్కింగ్	1,000
ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల్లోపు భారీ వాహనాలు ప్రవేశిస్తే	1,600

ఫ్రీటర్న్ ఇలా..

ప్రధానంగా బస్టాండ్ నుంచి క్లాక్‌టవర్ మీదుగా దేవరకొండ రోడ్డువైపు వెళ్లే వాహనదారునికి ఇబ్బంది లేకుండా పీవీఎస్ థియేటర్ నుంచి క్లాక్ టవర్ మీదుగా హైదరాబాద్‌వైపు వెళ్లే వారికి, హైదరాబాద్ రోడ్డు నుంచి ఎన్జీ కాలేజీ సర్కిల్ నుంచి వీటీ థియేటర్ వైపు వచ్చే వారికి ఫ్రీ టర్న్ ఏర్పాటు చేయనున్నారు. అదే విధంగా సిగ్నల్స్ పడినప్పుడు నిర్దిష్టంగా ఎక్కడ వాహనాన్ని నిలిపే స్థలాన్ని మార్కింగ్ చేయనున్నారు.

ప్రజల ప్రాణాలు రక్షించడానికే..



ప్రజల ప్రాణాలు రక్షించడానికే ట్రాఫిక్ నిబంధనలు కఠినతరంగా అమలు చేస్తున్నాం. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే సెల్‌ఫోన్, ట్యాబ్ ద్వారా ఫొటో తీయడం, సీసీ కెమెరాల ఆధారంగా ఆన్‌లైన్‌లో జరిమానా విధిస్తాం. ఎక్కువ ప్రమాదాలు మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. – రాజు, ట్రాఫిక్ సీఐ, నల్లగొండ

సబ్సిడీ డ్రిప్.. అందని ద్రాక్షేనా!

- నాలుగేళ్లుగా పూర్తిస్థాయిలో అందట్లే..
- అర్జీ పెట్టుకున్న రైతులు 11వేల మంది
- డ్రిప్ మంజూరైన హెక్టార్లు 500
- ఎదురుచూస్తున్న వేలాది మంది రైతులు
- జిల్లాలో తగ్గుతున్న కూరగాయలు, పండ్ల తోటల సాగు



కనగల్ మండలం తొరగల్‌లో సాగులో ఉన్న పందిరి బీర

సాగు విస్తీర్ణం వివరాలు (ఎకరాల్లో..)

పంటసాగు రకం	2023	2024
పండ్లతోటలు	55,000	50,300
కూరగాయలు	5,330	3,300

నల్లగొండ రూరల్: తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగు చేయాలని లక్ష్యంతో ప్రభుత్వం గతంలో రైతులకు డ్రిప్ పరికరాలు అందించేది. అయితే నాలుగేళ్లుగా దరఖాస్తులు చేసుకున్న రైతులందరికీ పూర్తిస్థాయిలో డ్రిప్ మంజూరు చేయకపోవడంతో పండ్లు, కూరగాయల తోటల సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. రైతులకు సబ్సిడీపై కొన్నేళ్లుగా ప్రభుత్వం అందిస్తూ వచ్చిన డ్రిప్ పరికరాలు గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన రైతు బంధు పథకం కారణంగా నిలిచిపోయాయి. కేవలం ఆయిల్‌పామ్ సాగుకే డ్రిప్ మంజూరు చేస్తుండడం.. ఇతర పంటల సాగుకు ఇవ్వకపోవడంతో రైతులు డ్రిప్ కోసం ఉద్యాన శాఖకు దరఖాస్తు చేయడం లేదు. రైతులు ఎకరం భమిలో సొంతంగా డ్రిప్ ఏర్పాటు చేసుకుని కూరగాయల పంటలు సాగు చేయాలంటే దాదాపు రూ.40 వేల నుంచి రూ.50 వేలు ఖర్చవుతుంది. పండ్ల తోటలకు రూ.30 వేలు ఖర్చవుతుంది. ప్రభుత్వం సబ్సిడీపై కూరగాయల సాగుకు ఎకరానికి రైతు వాటాగా రూ.5 వేలలోపు, పండ్ల తోటలకు రూ.4 వేలలోపు చెల్లిస్తే డ్రిప్ మంజూరు చేసేది. ఈ క్రమంలో ప్రభుత్వం ఐదు ఎకరాల్లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, బీసీ, ఓసీలకు 90 శాతం సబ్సిడీ వర్తింపజేసేది.

దరఖాస్తులు అధికం.. యూనిట్ల మంజూరు స్వల్పం

గత నాలుగేళ్లుగా డ్రిప్ మంజూరు కోసం రైతులు ప్రభుత్వానికి దరఖాస్తులు చేసుకుంటూనే ఉన్నారు. అయినా గత ప్రభుత్వం మంజూరు చేయలేదు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమయినా డ్రిప్ మంజూరు చేస్తుందని ఆశించిన రైతులు జిల్లా వ్యాప్తంగా 11 వేల మంది దరఖాస్తు చేసుకోగా 500 హెక్టార్లకు మాత్రమే ప్రభుత్వం డ్రిప్ యూనిట్లను మంజూరు చేసింది. దీంతో దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ పూర్తి స్థాయిలో సబ్సిడీ డ్రిప్ అందలేదు. రాజకీయ పలుకుబడి ఉన్న రైతులతోపాటు రాయకీయ నాయకులకు చెందిన కుటుంబాల వారికి మాత్రమే సబ్సిడీ డ్రిప్ పరికరాలు మంజూరు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్థిక స్థోమత లేని రైతులంతా పండ్ల తోటలు, కూరగాయల సాగు చేయడం సాధ్యం కాని పరిస్థితి నెలకొంది. దీంతో సన్న, చిన్నకారులు రైతులంతా ఏమి చేసేది లేక పత్తి, వరి పంటలు సాగు చేస్తున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా కూరగాయల సాగు, పండ్ల తోటల సాగు విస్తీర్ణం ఏటేటా తగ్గుతోంది. ఫలితంగా జిల్లా ప్రజల అవసరాలకు కావాల్సి వందలాది టన్నుల ఆకుకూరలు, కాయగూరలను ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి.

డ్రిప్ మంజూరు చేయకపోవడంతో వరిసాగు చేస్తున్నాం



మా ఊరికి నల్లగొండ పట్టణం అతిదగ్గరగా ఉండడంతో గతంలో రెండు ఎకరాల్లో కూరగాయల పంట సాగు చేశాను. డ్రిప్ లేకుండా కూరగాయల సాగు చేయడం ఆర్థికంగా భారమే అవుతుంది. ప్రభుత్వం డ్రిప్ మంజూరు చేయకపోవడంతో గతంలో వేసిన రెండు ఎకరాల కూరగాయల విస్తీర్ణాన్ని చదును చేసి వరి సాగు చేస్తున్నాం. కూరగాయలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి. ప్రభుత్వమే సబ్సిడీపై డ్రిప్, మల్చింగ్ షీట్‌ను అందిస్తే బాగుంటుంది.

– చిమట వెంకన్న, గుండ్లపల్లి, నల్లగొండ మండలం

సాగు భారమే..

డ్రిప్ లేకుండా పండ్ల తోటలు, కూరగాయల సాగు చేయడం రైతుకు ఆర్థికంగా భారమవుతోంది. ఎకరం విస్తీర్ణంలో వరి సాగుకు 76,23,200 లీటర్ల నీటిని వినియోగిస్తున్నట్లు అధికారుల అంచనా. ఈ నీటితో డ్రిప్ పద్ధతిలో 5 ఎకరాల్లో అనేక రకాల పండ్ల తోటలు, 4 ఎకరాల్లో సులభంగా కూరగాయల సాగు చేయవచ్చని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. డ్రిప్ లేకుండా కాల్వల ద్వారా నీటి తడులు ఇస్తే నీటి వృథాతో పాటు కలుపు పెరగడం, విద్యుత్ అదనపు వినియోగం, ఎరువుల వృథా అధికంగా ఉంటుంది. డ్రిప్ ఏర్పాటుతో రైతుకు వెసులుబాటుతో పాటు రెండింతల రెట్టింపు నాణ్యతమైన దిగుబడిని పొందవచ్చు.

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి ఒకరు మృతి

గరిడేపల్లి: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామ శివారులో శనివారం జరిగింది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం లింగగిరి గ్రామానికి చెందిన తోకల మహేష్(27) కొంతకాలంగా ఎల్‌టీ ఫైనాన్స్‌లో మార్కెటింగ్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. శనివారం లింగగిరి నుంచి మునగాలకు బైక్‌పై వెళ్లి తిరిగి రాత్రి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో రాయినిగూడెం గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి కిందపడడంతో తలకు బలమైన గాయాలై మృతిచెందాడు. అయితే తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని అతడి తండ్రి తోకల దుర్గయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వైన్స్‌లో చోరీ

- రూ.10.84లక్షలు ఎత్తుకెళ్లిన దుండగుడు


ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

గుర్రంపోడు: మండల కేంద్రంలోని ఆదిత్య వైన్స్‌లోకి శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి చొరబడి రూ.10.84లక్షలు ఎత్తుకెళ్లాడు. ఎస్‌ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దసరా పండుగ సందర్భంగా బ్యాంకులకు సెలవు కావడంతో ఆదిత్య వైన్స్ నిర్వాహకులు రెండు రోజుల కలెక్షన్ డబ్బులను శనివారం రాత్రి వైన్స్‌లోనే ఉంచి వెళ్లారు. ఆదివారం ఉదయం వైన్స్ తాళాలు తీసి చూడగా పైకప్పు రేకుకు రంధ్రం పడి ఉండటం గమనించారు. నగదు కూడా కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వైన్స్ వద్దకు చేరుకుని సీసీ కెమెరాను పరిశీలించగా.. గుర్తుతెలియని వ్యక్తి ముఖానికి దస్తీ చుట్టుకుని పైకప్పు రేకుకు రంధ్రం చేసి లోపలి ప్రవేశించి టేబుల్ డ్రాయర్‌లో ఉంచిన డబ్బును తీసుకెళ్లినట్లు గుర్తించారు. క్లూస్‌టీంను రప్పించి వేలిముద్రలను సేకరించారు. కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ, పరిసర పోలీస్ స్టేషన్ల ఎస్‌ఐలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వైన్స్ నిర్వాహకులు పాసుగోటి నర్సింహారావు, పోలేని రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

గుర్రంపోడు: మండలంలోని తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన గున్నెబోయిన సత్తయ్య ఎద్దు ఆదివారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తింగ్ వైర్ తగలడంతో ఎద్దు విద్యుదాఘాతానికి గురై మృతిచెందని బాధిత రైతు పేర్కొన్నాడు. ఎద్దు విలువ రూ.లక్ష ఉంటుందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

మద్యం దుకాణాలపై కేసు నమోదు

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలోని పలు మద్యం షాపులపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం దసరా పండుగ రోజున పలు మద్యం దుకాణాదారులు నిబంధనలకు విరుద్ధంగా ఉదయం 8గంటలకే షాపులను తెరిచారు. విషయం తెలుసుకున్న పోలీసులు శ్రీసాయివైన్స్, ఎస్‌వీఆర్ వైన్స్, సాయిదుర్గా వైన్స్, ఎస్‌వీ వైన్స్‌ను మూసివేశారు. సంబంధిత వైన్స్‌ల క్యాషియర్లు, యజమానులపై కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఆయా వైన్స్‌లను సీజ్ చేసినప్పటికీ తీవ్రమైన పైరవీల ద్వారా తిరిగి తెరిచినట్టు సమాచారం. పైరవీ వ్యవహారాన్ని గుట్టుగా ఉంచారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బేతవోలులో దసరా వేడుకల్లో ఘర్షణ

- కోదాడ టౌన్ సీఐ, చిలుకూరు ఏఎస్‌ఐతో పాటు పలువురికి గాయాలు
- పరిస్థితి అదుపుతప్పడంతో లాఠీచార్జి చేసిన పోలీసులు
- ఏఆర్ కానిస్టేబుల్‌తో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు


బేతవోలులోని కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో లాఠీచార్జి చేస్తున్న పోలీసులు

చిలుకూరు: మండలంలోని బేతవోలు గ్రామంలో శనివారం రాత్రి దసరా వేడుకల్లో ఘర్షణ చోటుచేసుకుంది. ఈ గొడవకు కారణమైన గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్, అతడి భార్యతో పాటు మరో ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. దసరా పండుగ సందర్భంగా ప్రతి ఏడాది మాదిరిగానే శనివారం రాత్రి బేతవోలు గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయం సమీపంలో వీర్లదేవి చెరువు వద్ద తెప్పోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ టౌన్ సీఐ రాము కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఆలయం వద్దకు వచ్చిన మాజీ సర్పంచ్ వట్టికూటి చంద్రకళ భర్త నాగయ్య చెరువు దగ్గర మూత్రవిసర్జన చేస్తుండగా గ్రామానికి చెందిన రెమిడాల వినోద్ సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. ఇది గమనించిన నాగయ్య కుటుంబ సభ్యుడు నరేష్ ఎందుకు వీడియో తీస్తున్నావని వినోద్‌ను అడగడంతో ఇరువురు మధ్య గొడవ మొదలైంది. ఈ క్రమంలో వారి వద్దకు గ్రామానికే చెందిన ఏఆర్ కానిస్టేబుల్ వరకుమార్ కుటుంబ సభ్యులు, వట్టికూటి నాగయ్య కుటుంబ సభ్యులు వచ్చి ఘర్షణ పడ్డారు. ఏఆర్ కానిస్టేబుల్ వరకుమార్ ఒక్కసారిగా నాగయ్యను ఉద్రిక్తత నెలకొంది. దీంతో అక్కడే ఉన్న కోదాడ టౌన్ సీఐ రాము, ఎస్‌ఐ రాంబాబు, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు వరకుమార్ వర్గం సభ్యులను దేవాలయం లోపలకు పంపించి గేట్లు వేసి, మరో వర్గం వారిని దేవాలయం నుంచి దూరంగా పంపించారు.

సీఐ, ఏఎస్‌ఐతో పాటు పలువురికి గాయాలు..

కొద్దిసేపటికే నాగయ్య వర్గీయులు దేవాలయానికి ఉన్న చిన్న గేటు గుండా లోపలికి వెళ్లారు. ఇరువర్గాల వారు రాళ్లు, పైపులతో దాడి చేసుకున్నారు. పరిస్థితి అదుపుతప్పడంతో సీఐ రాము, ఎస్‌ఐ రాంబాబుతో పాటు పోలీసులు లాఠీచార్జి చేశారు. ఈ క్రమంలో సీఐ, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. నాగయ్య వర్గీయులకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, స్పెషల్ పార్టీ పోలీసులతో ఘటనా స్థలం వద్దకు చేరుకుని వరకుమార్‌తో పాటు పలువురుని అదుపులోకి తీసుకున్నారు. రాత్రి మొత్తం గ్రామంలో పోలీసులు పికెటింగ్ నిర్వహించారు.

హత్యాయత్నం కేసు నమోదు

నాగయ్య కుటుంబ సభ్యులపై ఏఆర్ కానిస్టేబుల్ వరకుమార్ వర్గీయులు ఉద్దేశపూర్వకంగానే దాడి చేశారని పోలీసుల విచారణలో తేలడంతో వరకుమార్‌తో పాటు అతడి భార్య రాణి, గ్రామానికి చెందిన రెమిడాల వినోద్, నవీన్, తమలపాకుల నరసింహారావు, నెమ్మాది ప్రభు, నవీన్, వరకుమార్ తల్లిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాంబాబు తెలిపారు. వీరిలో ఇద్దరు పరారీలో ఉన్నట్లుగా తెలిసింది.

కారు, రెండు బైక్‌లు దగ్ధం..

ఆత్మకూరు(ఎం): మండలంలోని కూరెళ్ల గ్రామంలో శనివారం రాత్రి దసరా వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో కూరెళ్ల గ్రామంలో ఈసారి దసరా ఉత్సవాలను పంచాయతీ కార్యదర్శి నిర్వహిస్తారా లేక ఇంకెవరైనా నిర్వహిస్తారా అని గ్రామానికే చెందిన కాంగ్రెస్ నాయకుడు బెజ్జంకి భిక్షం, సీపీఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం ప్రశ్నించడంతో వారిపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. అంతేకాకుండా రాత్రి బెజ్జంకి భిక్షంకు చెందిన ఆల్టో కారు, బైక్‌తో పాటు అతడి చిన్నల్లుడి బైక్‌కు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ రెండు లీటర్ల పెట్రోల్ బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. కాగా మాజీ సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్య అనుచరులు బాషబోయిన నరేష్, నిమ్మనగోటి గణేష్, నవీన్ తన వాహనాలకు నిప్పంటించారని బాధితుడు బెజ్జంకి భిక్షం ఆరోపించారు. అయితే ఈ ఘటనకు తమకు ఎటువంటి సంబంధం లేదని మాజీ సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్య పేర్కొన్నారు. బెజ్జంకి భిక్షం గ్రామంలో ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తుంటారని, గిట్టని వ్యక్తులు ఈ దారుణానికి పాల్పడి ఉండవచ్చునని అన్నారు.


దగ్ధమైన కారు, బైక్‌లు

కలిసిరాని దసరా పండుగ

- విజయదశమి రోజు రోడ్డు ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్ దుర్మరణం
- గతేడాది పండుగ రోజే అతడి అన్న మృతి


బిచ్చానాయక్ (ఫైల్)

మర్రిగూడ: ఆ కుటుంబానికి దసరా పండుగ కలిసిరావడం లేదు. గతేడాది దసరా పండుగ రోజు అన్న మృతిచెందగా.. ఈ ఏడాది దసరా పండుగ రోజు తమ్ముడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వివరాలు.. మర్రిగూడ మండలం తూర్పుతండాకు చెందిన జర్పుల బిచ్చానాయక్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం అతడు బైక్‌పై మర్రిగూడ మండల కేంద్రం నుంచి తండాకు వెళ్తున్నాడు. అదే సమయంలో డోర్నాలబావి మూలమలుపు వద్ద కొండూరు గ్రామానికి చెందిన దుబ్బ శివ బైక్‌పై వస్తూ బిచ్చానాయక్ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బిచ్చానాయక్ తీవ్ర గాయాలు కాగా శివ అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు గమనించి బిచ్చానాయక్‌ను మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బిచ్చానాయక్ మృతిచెందిన విషయం తెలియడంతో బంధువులు పెద్దఎత్తున ఆస్పత్రికి తరలివచ్చారు. బిచ్చానాయక్ మృతికి కారణమైన శివ ఇంటి ముందు మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేపట్టాలని మృతదేహంతో గిరిజనులు వాహనంలో తరలివెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రంగారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించాలని బంధువులకు నచ్చజెప్పినప్పటికీ వారు వినిపించుకోలేదు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా గత సంవత్సరం దసరా పండుగ రోజే బిచ్చానాయక్ అన్న సైతం మృతిచెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

న్యాయం చేయాలని ఆందోళన..

బిచ్చానాయక్ కుటుంబానికి నష్టపరిహారం అందించే వరకు పోస్టుమార్టంకు తీసుకెళ్లేది లేదని అతడి కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలిస్తుండగా గిరిజనులు అడ్డుకుని మృతదేహాన్ని ఆస్పత్రి వద్ద ఉంచి ఆందోళన చేపట్టారు. మృతుడి భార్య జర్పుల స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

నాగారం: మండలంలోని పసునూర్ గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పసునూర్ గ్రామానికి చెందిన చిత్తలూరి హరీష్(40) రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. దసరా పండుగకు భార్యాపిల్లలతో కలిసి స్వగ్రామం పసునూరుకు వచ్చాడు. శనివారం దసరా పండుగ రోజు కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి సంతోషంగా గడిపాడు. ఆదివారం ఉదయం అకస్మాత్తుగా గుండె దగ్గర నొప్పిలేస్తుందని కుటుంబ సభ్యులకు చెప్పాడు. వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. హరీష్ దసరా పండుగకు స్వగ్రామానికి వచ్చి అనంతలోకాలకు వెళ్లడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.


చిత్తలూరి హరీష్ (ఫైల్)

బైక్ ఢీకొని ఒకరు దుర్మరణం

- మరో బాలుడికి గాయాలు

వలిగొండ: బైక్ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. మరో బాలుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన వలిగొండ మండలం ముద్దాపురం గ్రామ పరిధిలోని కొడమర్ల బావి వద్ద శనివారం రాత్రి జరిగింది. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడమర్ల బావికి చెందిన సూది నర్సిరెడ్డి(52), గున్నాల రక్షిత్ రెడ్డి దసరా పండుగ సందర్భంగా తమ ఇంటి ముందు నిల్చొని ఇతరులతో మాట్లాడుతుండగా.. వేములకొండ నుంచి మోత్కూరు వైపు బైక్‌పై అతివేగంగా వెళ్తున్న వారిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సూది నర్సిరెడ్డి, రక్షిత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ నర్సిరెడ్డి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.


నర్సిరెడ్డి (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

- మరొకరికి గాయాలు


నాగయ్య (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: బైక్‌ను ఎదురుగా డీజే వాహనం ఢీకొట్టడంతో యువకుడు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మిర్యాలగూడ మండలం రాయినిపాలెం గ్రామ సమీపంలో శనివారం జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాయినిపాలెం గ్రామానికి చెందిన బూర నాగయ్య (34), బూర సైదులు శనివారం బైక్‌పై మిర్యాలగూడకు వచ్చారు. దసరా పండుగ సందర్భంగా వారికి కావాల్సిన సామాన్లు తీసుకొని తిరిగి ఇంటికి వెళ్తున్నారు. రాయిపాలెం గ్రామ సమీపంలోకి వెళ్లగానే ఎదురుగా వస్తున్న డీజే వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగయ్య తల, ఛాతికి తీవ్ర గాయాలయ్యాయి. సైదులు కూడా గాయాలయ్యాయి. ఇరువురిని 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా బూర నాగయ్య అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు. మృతుడి కుటుంబాన్ని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ ఏరియా ఆస్పత్రిలో పరామర్శించారు. సైదులుకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు.

జనగామ జిల్లాలో తేరాల వాసి..

లింగాలఘణపురం: జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం క్లోం గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటకొండూరు మండలం తేరాల గ్రామ వాసి మృతిచెందాడు. లింగాలఘణపురం ఎస్‌ఐ బండి శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తేరాల గ్రామానికి చెందిన ఉర దావీన్ (28) బైక్‌పై జనగామ నుంచి తేరాలకు వస్తుండగా.. క్లోం క్రాస్ రోడ్‌లో అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రవణ్‌కుమార్ తెలిపారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి


లాంచీ దిగివస్తున్న పర్యాటకులు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. విద్యాసంస్థలకు సెలవులు ఉండడంతో సాగర్‌కు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బుద్ధవనం, విద్యుదుత్పాదన కేంద్రం, కొత్త వంతెన తదితర ప్రాంతాలను సందర్శించారు. లాంచీలో నాగార్జునకొండకు వెళ్లారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


అవిశెట్టి వినయ్ (ఫైల్)

చిట్యాల: వరికోత మిషన్‌కు హెల్పర్‌గా వెళ్లిన యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం చిట్యాల మండలం సుంకెనపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సుంకెనపల్లి గ్రామానికి చెందిన అవిశెట్టి శంకరయ్య కుమారుడు అవిశెట్టి వినయ్(19) ఆదివారం గ్రామ శివారులో వరికోత మిషన్‌కు హెల్పర్‌గా వెళ్లాడు. వరి పొలం పైనుంచి వెళ్తున్న విద్యుత్ వైర్లు వరికోత మిషన్‌కు తగిలాయి. అదే సమయంలో వరికోత మిషన్‌ను వినయ్ తగలడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి వినయ్‌ను చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి బలవన్మరణం

రామన్నపేట: అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రామన్నపేట మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేటకు చెందిన గాదె అండాలు పూలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఆమె పెద్ద కుమారుడు సాయిబాబు(30) మూడేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం రాత్రి పొద్దుపోయాక ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా సాయిబాబు ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి. మల్లయ్య తెలిపారు.

హార్డ్‌వేర్ దుకాణంలో అగ్నిప్రమాదం


కాలిబూడిదైన హార్డ్‌వేర్ దుకాణం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

- కాలిబూడిదైన సామగ్రి
- రూ.50లక్షల వరకు నష్టం
- పక్క ఇంటికి మంటలంటుకొని ఫర్నీచర్, 27తులాల బంగారం, భూమి పత్రాలు దగ్ధం

మోటకొండూర్: ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి హార్డ్‌వేర్ దుకాణంతో పాటు దానిని ఆనుకుని ఉన్న ఇల్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మోటకొండూర్ మండల కేంద్రంలో శనివారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మోటకొండూర్ మండలం గిరిబోయినగూడెం గ్రామానికి చెందిన గిరిబోయిన మల్కయ్య గత పదేళ్లుగా మోటకొండూర్ మండల కేంద్రంలో హార్డ్‌వేర్, ఎలక్ట్రానిక్ దుకాణాన్ని అద్దె భవనంలో నడిపిస్తున్నాడు. ఇటీవల తన సొంత స్థలంలో రేకుల షెడ్ వేసి అందులోకి దుకాణాన్ని మార్చాడు. శనివారం మధ్యాహ్నం దుకాణంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి సామాగ్రి కాలిబూడిదయ్యింది. స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో దుకాణానికి ఆనుకుని ఉన్న భూమండ్ల బుచ్చేందర్ ఇంటి గోడ కూలిపోయి ఫర్నిచర్, వంటగది, బీరువా, ఏసీ కాలిబూడిదయ్యాయి. 27తులాల బంగారం, విలువైన భూమి, ఇంటి పత్రాలు కూడా కాలిపోయినట్లు బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు. హార్డ్‌వేర్ షాపులో సుమారు రూ.50లక్షల సామాగ్రి కాలిబుడిదైనట్లు బాధితుడు మల్కయ్య పేర్కొన్నాడు. విషయం తెలుసుకున్న ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, సుదగాని ఫౌండేషన్ చైర్మన్ సుదగాని హరిశంకర్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు ధైర్యం చెప్పారు. సీఐ రమేష్, తహసీల్దార్ శాంతిలాల్, ఎస్‌ఐ పాండు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అంశల స్వామి తండ్రి మృతి


సత్యనారాయణ (ఫైల్)

మర్రిగూడ: ఫ్లోరోసిస్ విముక్తి పోరాట యోధుడు అంశల స్వామి తండ్రి అంశల సత్యనారాయణ(62) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. మర్రిగూడ మండలం శివన్నగూడ గ్రామానికి చెందిన అంశల స్వామి అనేక ఏళ్లు ఫ్లోరోసిస్‌పై పోరాటం చేశారు. 2023 జనవరి 28న అంశల స్వామి మృతిచెందారు. స్వామి మృతితో మానసికంగా కుంగిపోయిన ఆయన తండ్రి సత్యనారాయణ ఆదివారం మృతిచెందారు. ఆయనకు భార్య, కుమార్తె, అల్లుడు ఉన్నారు. సత్యనారాయణ మృతి పట్ల జలసాధన సమితి నాయకుడు దుశ్చర్ల సత్యనారాయణ తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

విజయవాడ - హైదరాబాద్ హైవేపై వాహనాల రద్దీ


చౌటుప్పల్‌లో హైవేపై రాత్రివేళ బారులుదీరిన వాహనాలు


చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద..

- దసరా పండుగ ముగియడంతో పట్నంకు తిరుగు పయనమైన ప్రజలు

చౌటుప్పల్ , చౌటుప్పల్ రూరల్ : హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం దసరా పండుగ తిరుగు ప్రయాణపు రద్దీ మొదలయ్యింది. దసరా నిమిత్తం హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వెళ్లిన ప్రజానీకం పండుగ ముగియడంతో పెద్ద సంఖ్యతో తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జాతీయ రహదారిపై ఇరు మార్గాల్లో విపరీతమైన రద్దీ నెలకొంది. ప్రధానంగా హైదరాబాద్ మార్గంలో విపరీతమైన రద్దీ ఏర్పడింది. కిలోమీటర్ల మేర వాహనాలు బారులుతీరాయి. రద్దీ కారణంగా వాహనాలు గంటలతరబడి ట్రాఫిక్‌లోనే ఉండాల్సి వచ్చింది. గ్రామ కూడళ్లు, జంక్షన్‌ల వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

పంతంగి టోల్‌ప్లాజా వద్ద..

చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద కూడా వాహనాల రద్దీ నెలకొంది. టోల్‌ప్లాజా నిర్వాహకులు హైదరాబాద్ మార్గంలో పది మార్గాల ద్వారా వాహనాలను పంపిస్తున్నారు. రద్దీ కారణంగా వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చందంపేట: మండలంలోని పొగిళ్ల గ్రామానికి చెందిన జటావత్ లాల్‌సింగ్ (38) గ్రామంలోని ఓ పిండి గిర్ని వద్ద శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దసరా వేడుకల్లో హైకోర్టు జడ్జి

రామన్నపేట: హైకోర్టు జడ్జి జస్టిస్ కూనూరు లక్ష్మణ్ తన స్వగ్రామమైన రామన్నపేట మండలం బోగారం గ్రామంలో శనివారం దసరా వేడుకల్లో పాల్గొన్నారు. ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామస్తులతో కలిసి ఆయన జమ్మిచెట్టు వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్జి తన తల్లిదండ్రులకు జమ్మి పెట్టి ఆశీర్వచనం తీసుకున్నారు. గ్రామస్తుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు గంపల రామచంద్రారెడ్డి, రాపోలు శివరంజని, మాజీ ఎంపీటీసీ గోగు పద్మ తదితరులు ఉన్నారు.


జమ్మిచెట్టు వద్ద పూజలు చేస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ కూనూరు లక్ష్మణ్

చికిత్స పొందుతూ టిప్పర్ డ్రైవర్ మృతి

శాలిగౌరారం: ఎస్‌ఐ కొట్టాడని మనస్తాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన టిప్పర్ డ్రైవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆకారం గ్రామానికి చెందిన శెనిగ నాగరాజు(38) సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తొండ గ్రామంలోని బాలాజీ క్రషర్ మిల్లులో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఆరు నెలలు పనిచేసిన తర్వాత నాగరాజు క్రషర్ మిల్లు నుంచి బయటకు వచ్చాడు. క్రషర్ మిల్లు యజమాని గొలుసుల వెంకన్న నాగరాజుకు రెండు నెలల జీతం ఇవ్వాల్సి ఉండగా.. ఇటీవల నాగరాజు వెంకన్నకు ఫోన్‌చేసి జీతం డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. ఈ నేపథ్యంలో డీజిల్ దొంగతనం జరిగిందంటూ క్రషర్ మిల్లు యజమాని తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో నాగరాజుతో పాటు మరికొంత మంది టిప్పర్ డ్రైవర్లపై ఫిర్యాదు చేశాడు. దీంతో నాగరాజును ఎస్‌ఐ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి తీవ్రంగా కొట్టాడు. తీవ్ర మనస్తాపానికి గురైన నాగరాజు ఈ నెల 4వ తేదీన తన వ్యవసాయ భూమి వద్ద చింతచెట్టుకు ఉరితాడు బిగించుకొని సెల్ఫీ వీడియో తీసుకుని తన స్నేహితుడికి పంపించాడు. సదరు స్నేహితుడు సమీపంలోని రైతుల సహాయంతో నాగరాజు వద్దకు చేరుకుని 108 వాహనంలో అతడిని నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.